టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంఈవోలు, హెచ్‌ఎంల సమీక్షలో అదనపు కలెక్టర్ రాంబాబు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధన కోసం మండల విద్యాధికారులు, హెచ్‌ఎంలతో ఐడీవోసీలో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు ఉత్తీర్ణులయ్యే విధంగా కృషిచేయాలని సూచించారు. పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి 2 లేదా 3 సార్లు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు వారికి వివరించాలని అన్నారు. ఉత్తీర్ణత శాతంలో జిల్లాను మొదటి ఐదు స్థానాల్లో ఉంచాలని, దాని సాధన కోసం ఈ 40 రోజులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరింత శ్రమించాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్పెషల్ క్లాసెస్ నిర్వహించాలని సూచించారు. అంతకుముందు గత సంవత్సరంలో 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత రావడానికి గల కారణాలను విశ్లేషించారు. డీఈవో వెంకటేశ్వరచారి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మాధవరావు, ఎంఈవోలు , సమగ్ర శిక్షా కో ఆర్డినేటర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

83 రోజుల ముందే లక్ష్య సాధన

రామవరం, ఫిబ్రవరి 7: సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏరియా జీఎం శాలెంరాజు సూచించారు. కిష్టారం ఓసీలో బుధవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సమావేశంలో మాట్లాడారు. సీఎండీ బలరాం ఆదేశానుసారం సంస్థలోని ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని రక్షణతో సమైక్యంగా, సమర్థంగా సాధించాలని సూచించారు. ఏరియాలోని కిష్టారం ఓసీలో 365 రోజుల్లో సాధించాల్సిన 20 లక్షల టన్నుల లక్ష్యాన్ని 83 రోజుల ముందుగానే సాధించినందుకు అధికారులు, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ హనా సుమలత, డీజీఎం యోహాన్, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, కిష్టారం ఓసీ పీవో ఎంవీ నరసింహారావు, ప్రాజెక్టు ఇంజినీర్ రమణారావు, మేనేజర్ రామకృష్ణ, రక్షణ అధికారి గోపీ కిశోర్, సంక్షేమాధికారి సందీప్, ఇతర ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని నర్సాపురం సూదిరెడ్డి నాగిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)కు చెందిన ఆలపాటి క్రాంతికిరణ్, వాసిరెడ్డి రాఘవరావు పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులకు సైకిళ్లను బుధవారం వితరణగా అందజేశారు. ఉపాధ్యాయులు సీహెచ్.అనిల్‌కుమార్, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఐ అశోక్‌కు సన్మానం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 7: దుమ్ముగూడెం సీఐ అశోక్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మండల కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండీ.జానీపాషా, ఎంపీటీసీ మడకం రామారావు, నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్, జిలకర గంగరాజు, కెల్లా శేఖర్, పొడియం సుబ్బారావు, లంకా శివ, నరేంద్ర, మునీంద్ర పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

భద్రాచలం, ఫిబ్రవరి 7: పలు చోట్ల చోరీలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్న దొంగను బుధవారం భద్రాచలం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నాగరాజ్ రెడ్డి కథనం మేరకు భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, ఖానాపురం హవేలీలో దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న బానోత్ ప్రశాంత్‌ను అరెస్ట్ చేశామన్నారు. భద్రాచలం బస్టాండ్‌లో బంగారం, వెండి వస్తువులతో వేచి ఉన్న ప్రశాంత్‌ను పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రమాబాయి అంబేద్కర్ జయంత్యుత్సవం

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 7: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి, రమాబాయి అంబేద్కర్ జయంత్యుత్సవాన్ని మాలమహానాడు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి శ్రీనివాసరావు బుధవారం బూర్గంపహాడ్‌లో నిర్వహించారు. రమాబాయి చేసిన సమాజ సేవను వివరించారు. ముందుగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పిల్లి రవివర్మ, మహేష్, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీల్లో కోతుల బెడదను నివారించాలి'

చుంచుపల్లి, ఫిబ్రవరి 7: పంచాయతీల్లో కోతుల బెడద నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు విన్నవించారు. మండలంలోని రుద్రంపూర్, గౌతంపూర్, త్రీ ఇంక్లైన్ పంచాయతీల్లో ప్రత్యేక అధికారి, ఎంపీవో గుంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీటీసీ ఇళ్ల పరమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో కోతుల బెడద ఎక్కువైందని, ఇళ్లపై స్వైర విహారం చేస్తూ పలువురిని కరుస్తున్నారని అన్నారు. వీటిని పట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట ఆడుతున్న తొమ్మిదిమంది అరెస్ట్

సారపాక, ఫిబ్రవరి 7: మండలంలోని సోంపల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. తొమ్మిదిమందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఎనిమిది సెల్ ఫోన్లు, రూ.60వేల నగదు స్వాధీనపర్చుకున్నారు.

రామాలయం ముఖ మండపానికి వెండి ద్వారం

భద్రాచలం, ఫిబ్రవరి 7: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి ఆలయ ముఖ మండపానికి 100 కేజీల వెండి ద్వారాన్ని బుధవారం అమర్చారు. దేవస్థానం వారు ఇందుకు 70 కేజీల వెండిని ఇవ్వగా దాతలు సుమారు 30 కేజీలతో వెండి ద్వారాన్ని తయారు చేయించారు.

ANUBOSE INSTITUTE OF TECHNOLOGY
K.S.P. ROAD, PALVONCHA - 507115 (Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH, Hyderabad)

WANTED FACULTY

Applications are invited for the posts of Principal / Professors / Associate Professors / Assistant Professors and Lab Technicians in EEE, ECE, CSE CIVIL, MINING, MBA, athematics, Physics, Chemistry and English. Qualifications and pay are as per AICTE norms. Interested candidates may send their resume along with passport size photo on or before **15.02.2024**. Short listed candidates have to attend the interview for JNTUH ratification. Contact for any other quires - 9246907407

Principal

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

ప్రజల సహకారంతో మెరుగ్గా పారిశుధ్యం

టేకులపల్లి, ఫిబ్రవరి 7: ప్రజల సహకారంతో పారిశుధ్యాన్ని మెరుగ్గా ఉంచవచ్చని, ఇతరత్రా సమస్యలను కూడా పరిష్కరించవచ్చని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను బుధవారం టేకులపల్లిలో ప్రారంభించారు. చీపురు పట్టి రోడ్డు ఊడ్చారు. గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రజలను సమన్వయపర్చుకుంటూ సమస్యలను పరిష్కరించాలని, పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి కె.వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం పీడీవో కె.వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు జాలది అప్పారావు, ఉండేటి ప్రసాద్, మాజీ సర్పంచ్ సరిత పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 7: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అశ్వారావుపేట, పేరాయగూడెం, గుర్రాలచెరువు, అల్లిగూడెం పంచాయతీల్లో బుధవారం ర్యాలీలు, గ్రామసభలు జరిగాయి. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీడీ సుచిత్ర, ఈఓ గజవెల్లి హరి కృష్ణ, కార్యకదర్శులు శ్రీరామూర్తి, తేజ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని పది పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, ఫిబ్రవరి 7: మండలంలోని తిప్పనపల్లి పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవ గ్రామసభను పంచాయతీ ప్రత్యేకాధికారి/తహసీల్దార్ సాజియా సుల్తానా ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి శివ, ఎంపీటీసీ సభ్యురాలు లంకా విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ గుగులోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మామిళ్లవారిగూడెం, వినాయకపురం, మల్లాయిగూడెం, ఆసుపాక గ్రామ సభల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారులు సీతారామరాజు, స్వప్న, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: రోడ్డు ఊడుస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

చుంచుపల్లి/ పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 7: చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్, గౌతంపూర్, త్రీ ఇంక్లైన్ పంచాయతీల్లో ప్రత్యేకాధికారి/ఎంపీవో గుంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు జరిగాయి. ఎంపీటీసీ సభ్యుడు ఇళ్ల పరమేష్ పాల్గొన్నారు. పాల్వంచ మండలం తోగ్గూడెం పంచాయతీలో ప్రత్యేకాధికారి నీలావతి మాట్లాడారు. అన్ని పంచాయతీల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని పంచాయతీల్లో సభలు నిర్వహించారు.

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 7: స్థానిక కూనవరం పంచాయతీలో ఎంపీటీసీ సభ్యుడు గుడిపూడి కోటేశ్వర రావు ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. కార్యదర్శి సంధ్యారాణి, పీవో పల్నాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారపాక, ఫిబ్రవరి 7: మండలంలోని తాళ్లగొమ్మూరు రైతు వేదికలో బుధవారం పారిశుధ్య వారోత్సవ సభ జరిగింది. పంచాయతీ ప్రత్యేకాధికారి సలోమి, కార్యదర్శి తలగాని మురళి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 7: మండల కేంద్రమైన లక్ష్మీనగరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులతో కలిసి పంచాయతీల్లో పారిశుధ్య వారోత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఎంపీపీ రేసు లక్ష్మి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు జరిగే పారిశుధ్య వారోత్సవాల్లో గ్రామాల్లో సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేధింపులను ఆపకపోతే ఆందోళన

అధికారులతో మాట్లాడుతున్న హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ నాయకులపై వేధింపులను ప్రభుత్వం ఆపకపోతే ఆందోళనకు దిగుతామని ఆ పార్టీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. మండలంలోని రాజీవ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొండపల్లి సరిత కుటుంబానికి చెందిన నిర్మాణాలను అటవీ, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. దీనిని హరిప్రియానాయక్ ఖండించారు. అధికారులను నిలదీశారు. ముందుగా నోటీసులు ఇవ్వకుండా ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. సరిత మామ కోటయ్య మాట్లాడుతూ.. కూల్చివేసిన నిర్మాణాల్లో తమ కుటుంబం గత 30 సంవత్సరాలుగా నివసిస్తున్నదని చెప్పారు. ఇన్నాళ్లూ ఈ భూమి అధికారులకు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. తమకు ముందస్తుగా నోటీసులు ఇవ్వలేదని అన్నారు.

'నోటీసులు ఇచ్చాకే తొలగించాం'

కొండపల్లి సరిత కుటుంబానికి చెందిన మామిడి తోట, అందులోని కోళ్ల పారం.. అటవీశాఖ పరిధిలో ఉన్నాయని డీఎఫ్‌వో వెంకన్న తెలిపారు. కూల్చివేతపై ఆయనను 'నమస్తే' వివరణ కోరింది. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని అన్నారు. చివరకు, ఆ ఇంటి గోడకు నోటీస్ అంటించినట్లు చెప్పారు. అప్పటికీ స్పందన లేకపోవడంతో అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు వివరించారు.

'కార్మిక వాడలకు శుభ్రమైన నీటిని సరఫరా చేయాలి'

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 7: కార్మిక వాడలకు పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని బర్లిపిట్ ఫిల్టర్‌బెడ్‌లో మంచినీరు పరిస్థితులను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం సివిల్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సూపరింటెండెంట ఇంజినీర్ రవితో కలిసి ఫిల్టర్ చాంబర్లను, మంచి నీటి చాంబర్‌ను, క్లోరినైజేషన్ ప్లాంట్‌ను కూడా పరిశీలించారు. నాయకులు వంగా వెంకట్, వీరస్వామి, రమణమూర్తి, రాములు, గట్టయ్య, నితిన్, క్రిష్టఫర్, బడుగు రమేశ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

పర్ణశాల, ఫిబ్రవరి 7: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో బుధవారం నుంచి పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గౌరారం, పైడిగూడెం గ్రామసభల్లో ఎంపీపీ రేసు లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శానిటేషన్ వారోత్సవాలు పంచాయతీ స్పెసల్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్పెషల్ అధికారులు, ఎంపీడీవో ముత్యాలరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడు కేజీల గంజాయి పట్టివేత

జూలూరుపాడు, ఫిబ్రవరి 7: ద్విచక్రవాహనంపై తరలిస్తున్న ఏడు కేజీల ఎండు గంజాయిని స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు వాహన తనిఖీలు చేపడుతుండగా రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన కార్తికేయ, సూర్యచరణ్‌లు ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తున్నారు. వారి వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా.. వారి వద్ద ఏడు కేజీల గంజాయి లభించింది. దీంతో దానిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్‌రాజు పేర్కొన్నారు.

ఇంటి పెద్దను కొట్టి చంపిన ముగ్గురి అరెస్ట్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: హత్య కేసు నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని షిర్డీసాయి నగర్ నివాసి కోనా వీరభద్రం, తన భార్య రాములమ్మను తరచూ వేధిస్తున్నాడు. ఆమె ఫిర్యాదుతో 2008లో వీరభద్రంపై కేసు నమోదైంది. ఆ తర్వాత కూడా వేధింపులు కొనసాగాయి. ఆసుపాకలో ఉంటున్న కుమార్తె విజయలక్ష్మి ఇంటికి 15 రోజుల క్రితం రాములమ్మ వెళ్లింది. ఈ నెల 2న అక్కడకు వీరభద్రం వెళ్లి, రాములమ్మతో ఘర్షణ పడ్డాడు. దీనిని రాములమ్మ, కుమారుడు నరేష్, కుమార్తె విజయలక్ష్మి భరించలేకపోయారు. ఆవేశంలో వీరభద్రంపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వీరభద్రం.. చనిపోతే కేసు అవుతుందని భయపడ్డారు. ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని మాయం చేసి, ఎటో వెళ్లిపోయాడని చెప్పి బంధువులను నమ్మించాలని పథకం వేశారు. మృతదేహాన్ని దహనం చేసేందుకు ఏపీలోని కొవ్వూరు తీసుకెళ్దామనుకున్నారు. ఇంతలోనే బంధువులకు విషయం తెలిసింది. మృతదేహాన్ని చూపించకపోతే కేసు పెడతామని వారు బెదిరించారు. దీంతో, మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వదిలేసి పారిపోయారు. నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారిని కొత్తగూడెం కోర్టులో హాజరుపరిచారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

గుండాల, ఫిబ్రవరి 7: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పోరు సాగాల్సి ఉందని సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆయన బుధవారం గుండాలలో విలేకరులతో మాట్లాడారు.. శ్రమ జీవుల హక్కులను మోదీ ప్రభుత్వ కాలరాస్తున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా సమ్మె జరగనుందని అన్నారు. దీనికి యావన్మంది ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు నాయిని రాజు, ఈసం శంకర్, యాకూబ్‌షావలి, బోస్, వాంకుడోత్ అజయ్, బొర్ర వెంకన్న, కొమరం శాంతయ్య పాల్గొన్నారు.

సారపాక, ఫిబ్రవరి 7: దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ వాల్ పోస్టర్‌ను తెలంగాణ కార్మిక సంఘం, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా నాయకులు బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో ఆవిష్కరించారు. బత్తుల వెంకటేశ్వర్లు, జక్కుల రాంబాబు, ఇర్పా సతీష్, మందా నాగరాజు, కేసుపాక రమేష్, అలవాల కోటేశ్వరరావు, మంద సంపత్, బల్లా పుల్లయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు ఉప్పతల నరసింహారావు కోరారు. పట్టణంలోని బిల్డింగ్ వర్కర్స్ అడ్డాలో బుధవారం కార్మికులతో సమావేశమయ్యారు. నాయకులు నబీ, కృష్ణ, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

చండ్రుగొండ, ఫిబ్రవరి 7: దేశవ్యాప్త సమ్మె సన్నాహక జేఏసీ సమావేశం సీపీఎం స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగింది. నాయకులు ఎస్‌కే ఉమర్, బొర్రా కేశవులు, పెద్దిని వేణు, తేజావత్ భీముడు, జడ శ్రీను, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, ఫిబ్రవరి 7: సమ్మె సన్నాహక సమావేశం బుధవారం టేకులపల్లిలో జరిగింది. నాయకులు భూక్యా హర్జియానాయక్, బానోత్ ఊక్లనాయక్, గుగులోత్ రామచందర్, కల్తీ వెంకటేశ్వర్లు, ధర్మపురి వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

భద్రాచలం, ఫిబ్రవరి 8: మాతాశిశు మరణాలు తగ్గించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. (భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, ఎంసీహెచ్ సెంటర్ రామవరంలో నెలకు 100 కు పైగా స్కానింగులు చేయాలని అధికారులను ఆదేశించారు. గొత్తికోయ, కొండరెడ్ల గ్రామాల్లో ఇంజినేష్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో మాతాశిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్‌ఎంవో డాక్టర్ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెన్కో క్రీడల్లో కేటీపీఎస్ 5, 6 దశల క్రీడాకారుల ప్రతిభ

పాల్వంచ, ఫిబ్రవరి 7: ఈ నెల 3 నుంచి 5 వరకు పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6 దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్స్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, హాకీ పోటీల్లో కేటీపీఎస్ 5, 6 దశల క్రీడాకారులు సత్తా చాటారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తోపాటు విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం 5, 6 దశల సీఈ ప్రభాకర్ రావు తన చాంబర్‌లో క్రీడాకారులను ప్రత్యేకంగా సన్మానించారు. బాస్కెట్‌బాల్, హాకీ క్రీడల్లో ప్రథమ బహుమతులు సాధించిన కెప్టెన్లు మంగులాల్‌తోపాటు క్రీడాకారులను అభినందించారు. స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ, ఎస్‌ఈ సివిల్ మోక్షవీర్, వీరస్వామి, వైటీఎంకే రాజు, వెల్ఫేర్ ఆఫీసర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బీఏఎస్ కోసం పాఠశాలల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకం కింద (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు అందించేందుకు ఆసక్తిగల పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనసూర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన, పేరు ప్రఖ్యాతలు కలిగిన ప్రైవేట్ పాఠశాలలు ఇందుకు అర్హమైనవని చెప్పారు. మంచి మౌలిక వసతులు ఉండి, గడిచిన ఐదేళ్లలో 7వ తరగతి నుంచి 10వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత, అందులో 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కలిగి ఉన్న పాఠశాలలకు అవకాశం ఉందని అన్నారు. ఆసక్తిగల పాఠశాలలు తమ ప్రతిపాదనలను ఈ నెల 22 సాయంత్రం 5 గంటల్లోపు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9959271030, 8106746383 నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 7: అనారోగ్యంతో ఇటీవల మరణించిన లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కారింగుల రాజు కుటుంబానికి తోటి ఆటోడ్రైవర్లు బాసటగా నిలిచారు. తమకు తోచిన రీతిలో సహాయం చేశారు. అలాగే ఆ ఆటోడ్రైవర్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పట్టణానికి చెందిన ఓ వస్త్రదుకాణ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ యాజమాన్య బాధ్యులు స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. వస్త్ర దుకాణ మేనేజర్ యూసుఫ్, తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 7: భద్రాద్రి రామాలయంలో బుధవారం సీతారాములకు నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలను భక్తి, శ్రద్ధలతో జరిపారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 7: రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. సైబర్ నేరాలపై మణుగూరు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్, మొబైల్ ఆధారంగానే ఈ మోసాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై అవగాహన పెంచుకుంటే మోసపోకుండా ఉండవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏఎస్సై మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 7: పోక్సో కేసులో వ్యక్తికి కఠిన కారాగారశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి ఎం.శ్యాంశ్రీ తీర్పు బుధవారం చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక 2021 అక్టోబర్ 12న తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఆడుకుంటోంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్యనారాయణ అలియాజ్ సత్యబాబు వచ్చి చాకెట్లు ఇస్తానంటూ బాలికకు మాయమాటలు చెప్పాడు. ఇంటికి తీసుకెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని ఆ బాలిక తన తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి అప్పటి ఎస్సై సురేశ్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సత్యంబాబుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతడికి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.

సంక్షిప్తం

గిరిజన గురుకుల కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో చరిత్ర విభాధిపతిగా పనిచేస్తున్న అధ్యాపకులు అరుణ కేయూ నుంచి డాక్టరేట్ పొందారు. 'హైదరాబాద్ సంస్థానంలో మహిళా విద్యాభివృద్ధి' (1853-1948) అనే అంశంపై కాకతీయ యూనివర్సిటీ డీన్ ఆఫ్ సోషల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ సారథ్యంలో ఆమె పరిశోధన చేశారు. దానికి గాను ఆమెకు కేయూ నుంచి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు అభినందించారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: స్థానిక వ్యవసాయ కళాశాలలో అంతర్ కళాశాలల క్రీడాపోటీలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. క్రికెట్ సెమీ ఫైనల్‌లో వరంగల్ జట్టుపై జగిత్యాల జట్టు గెలుపొందింది. బాలికల వాలీబాల్‌లో అశ్వారావుపేట జట్టుపై రాజేంద్ర నగర్ జట్టు విజయం సాదించింది. టెన్నీకాయిట్, చదరంగం, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అశ్వారావుపేట జట్లు గెలుపొందాయి.

జీవామృతం తయారీపై శిక్షణ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 6: చేపల వ్యర్థాలు, బెల్లం ద్రావణంతో జీవామృతం తయారీపై మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో రైతులకు లీడ్ ఫార్మర్ మొడియం రాములమ్మ మంగళవారం శిక్షణ ఇచ్చారు. చేప వ్యర్థాలు, బెల్లం ద్రావణం పిచికారీతో కూరగాయల మొక్కలు, వరి, వేరుశనగ తదితర పంటల పెరుగుదల ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు

చండ్రుగొండ, ఫిబ్రవరి 7: గంజాయి చాక్లెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని దుకాణదారులను ఎస్సై మాచినేని రవి హెచ్చరించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని దుకాణాలను ఆయన బుధవారం రాత్రి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లుగా సమాచారం ఉందని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని బీఎస్ఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సీడీపీవో రోజారమణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సౌజన్య, పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన ఎస్పీ

భద్రాచలం, ఫిబ్రవరి 7: ముంబైలో డిసెంబర్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు గాలి రామ్మోహనరావు బంగారు పతకం సాధించాడు. బుధవారం రామ్మోహనరావు ఎస్పీని కలిశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

వెట్టిచాకిరీపై పోలీసులకు ఫిర్యాదు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో ఓ కార్యాలయ నిర్మాణంలో ఇతర రాష్ట్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్.. ఓ బాల కార్మికుడితో పనిచేయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు సీడీపీవో కనకదుర్గ ఆ పని ప్రదేశానికి చేరుకున్నారు. ఈ లోపు ఆ కాంట్రాక్టర్ ఆ బాలుడిని దాచిపెట్టాడు. ఇంతలో ఆ సీడీపీవో వచ్చి ఆ బాలుడిని చూపించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఆమెతో కాంట్రాక్టర్ వాగ్వాదానికి దిగాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీడీపీవో ఫిర్యాదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K.
9160900024 / 9640400073.
NT-319433-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారింపు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.